## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386    85220 22029

Land Line No : 08517 224194



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం

Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 03 సంచిక : 336 ఆదివారం 03-03-2024 పేజీలు :04 వెల:రూ.2.00


## యాదాద్రి కాదు..యాదగిరిగుట్టనే

పాతపేరునే కొనసాగిస్తామన్న మంత్రి కోమటిరెడ్డి
త్వరలోనే జీవో విడుదల చేస్తామని వెల్లడి
కాళేశ్వరానికి చీఫ్ ఇంజనీర్ కెసిఆర్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్న



హైదరాబాద్,మార్చి2 : యాదాద్రి కాదు ఇకపై యాదగిరిగుట్టగా పిలువబడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మారుస్తూ త్వరలోనే జీఓ విడుదల చేస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పటికీ తండ్రి కేసీఆర్ చాటు కొడుకే. నేను ఉద్యమాలు చేసి వచ్చాను. మేం జీరో బిల్ ఇచ్చినట్టు.. కేటీఆర్‌కి జీరో నాలెడ్జ్ ఉంది. నాలెడ్జ్ లేని కేటీఆర్ గురించి మాట్లాడడం వృథా. ఫ్లోర్ లీడర్ ఇవ్వకపోతే హరీష్ కూడా బీజేపీలోకి పోతాడు. కాళేశ్వరం కట్టిన చీఫ్ డిజైనర్ కేసీఆర్ మేడిగడ్డ ఎందుకు పోలేదు?. కాళేశ్వరం పనికిరాదని ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్ ఇచ్చింది. ప్రజలే కేసీఆర్‌ను నామరూపాలు లేకుండా చేశారు. ఎంపీ అభ్యర్థులపై అంతర్గత సర్వే జరుగుతోంది. భువనగిరి నుండి పోటీ చేయమని రాహుల్ గాంధీని కోరాను. భువనగిరి, ఖమ్మం, నల్గొండలో.. దక్షిణాదిలో టాప్ మెజార్టీ వస్తుంది. మోదీ కంటే రాహుల్ గాంధీ ఎక్కువ మెజారిటీతో గెలుస్తారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.యాదగిరిగుట్టను కేసీఆర్ సీఎం అయిన తర్వాత అభివృద్ధి చేశారు. యాదాద్రిగా పేరు మార్చారు. కానీ యాదగిరిగుట్టగానే ఎక్కువ మంది పిలుస్తున్నారు. అదేపేరు ఉండాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరోసారి తెరపైకి వచ్చింది. యాదాద్రి పేరును మళ్లీ యాదగిరిగుట్టగా మారుస్తామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రెండు రోజుల కిందట ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తారని చెప్పారు. ఆలయ అభివృద్ధిపై రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. నెల రోజుల్లోగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామని అయిలయ్య వెల్లడించారు. క్షేత్రానికి పూర్వం నుంచి ఉన్న పేరును మార్చడం సరికాదన్న అయిలయ్య.. తిరిగి యాదగిరిగుట్టగా పేరు మార్చే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అయితే యాదగిరిగుట్టగా ఉన్న పేరును మాజీ సీఎం కేసీఆర్ యాదాద్రిగా మారుస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు. తిరుమల వెంకన్న ఆలయం స్థాయిలో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో యాదాద్రి అని నామకరణం చేస్తూ.. ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించి నప్పుడు ప్రకటించారు. యాదాద్రి పేరును చినజీయర్ స్వామి సూచించారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ తర్వాత యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మారుస్తారనే వార్తలు వచ్చాయి. క్షేత్ర పర్యటనకు అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ వచ్చిన సమయంలో యాదగిరిగుట్ట అనే పేరుతోనే ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటనలు విడుదల చేసింది. దీంతో గుడి పేరును తిరిగి యాదగిరిగుట్టగా మారుస్తున్నారనే వార్తలు వచ్చాయి. అయితే దానిపై ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేసే అవకాశం ఉంది. యాదాద్రి కాదు ఇకపై యాదగిరిగుట్టగా పిలువబడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. యాదాద్రి పేరును యాదగిరి గుట్టగా మారుస్తూ త్వరలోనే జీఓ విడుదల చేస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు.

## రైతుల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..



హైదరాబాద్, మార్చి 2 రాష్ట్రంలో త్వరలోనే రైతు కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. మన విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని అన్నారు.రైతులు, కౌలు రైతుల సాధక బాధకాలు, వాళ్ల సంక్షేమం, వ్యవసాయ రంగంలో సంస్కరణలకు సంబంధించి రైతు కమిషన్ తగిన సలహాలు సూచనలు అందిస్తుందని అన్నారు. సచివాలయంలో వివిధ సామాజిక సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్?ను తెరిచామని, ప్రజా భవన్?ను ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు అనువుగా అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అందుకే ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్ పరిస్థితి, సాగునీటి రంగంపై పూర్తి వివరాలతో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామని చెప్పారు. మహిళలు, నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. రైతులు, నిరుద్యోగులకు మేలు చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అందరి సూచనలు , సలహాలు ఆధారంగా కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలనే ఆలోచనలను పంచుకున్నారు. రైతు భరోసా అనేది రైతులకు పంటలకు పెట్టుబడి సాయంగా అందించేదని, రైతు భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. నిస్సహాయులకు, నిజమైన లబ్దిదారులకు అవసరమైతే చెప్పిన దానికంటే ఎక్కువ సాయం చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉందని చెప్పారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని, అన్ని పంటలు విస్తరించేలా రైతులు సరికొత్త విధానాలను అనుసరించాలని అన్నారు.రాష్ట్రంలో పాఠశాలలు,

### విద్యారంగంలో మార్పులివే..

విద్యాలయాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలను వేర్వేరు చోట్ల కాకుండా, దాదాపు 25 ఎకరాల్లో ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా ముందుగా కొడంగల్?లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ నెలకొల్పుతామన్నారు. దశల వారీగా అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తామని చెప్పారు. దీంతో కుల, మత వివక్ష తొలగిపోతుందని అన్నారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలతో పాటు పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేసినట్లు సీఎం గుర్తు చేశారు. గ్రూప్ 1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని చెప్పారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామన్నారు.

## కాళేశ్వరంలో అవినీతి అక్రమాలు నిజం

కాగ్, విజిలెన్స్ సంస్థలు నిగ్గు తేల్చాయి
అయినా ఎందుకు ఉపేక్షిస్తున్నారు
కాంగ్రెస్ ప్రభుత్వానికి బండి ప్రశ్న



కరీంనగర్,మార్చి2 : కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని కాగ్, విజిలెన్స్ సంస్థలు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై దొంగాట ఆడుతూ ప్రజలను మభ్యపెడు తున్నాయని మండిపడ్డారు. శనివారం కరీంనగర్ జిల్లాలో ప్రజాహిత యాత్రలో భాగంగా జమ్మికుంట మండలం శాయంపేటలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. విచారణ పేరుతో కాంగ్రెస్ జాప్యం చేస్తూ.. 6 గ్యారంటీల అమలు అంశాన్ని పక్కదోవ పట్టిస్తుందని ఆరోపించారు. ఇచ్చిన మాట మేరకు వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేసి తీరాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉందన్నారు బండి సంజయ్. తెల్ల రేషన్ కార్డు ఉన్నా.. రూ.500లకు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలులో కోత పెడుతున్నారని.. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డు కుటుంబాలుంటే.. 50 లక్షల కుటుంబాలకు కోత పెట్టడం అన్యాయమన్నారు. వినీతిని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ సైతం.. 6 గ్యారంటీల హామీల అమలు కోసం నిలదీ యలేక పోతోందని అన్నారు. హైదరాబాద్ నుండి కరీంనగర్, రామగుండం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం రక్షణ భూములివ్వడం హర్షణీయమని సంజయ్ అన్నారు. పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెడితే కేంద్రం ఏ విధంగా సహకరిస్తుందో.. ఇదే నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్.. కేంద్రాన్ని తిట్టడానికే పరిమితమైందే తప్ప ఏనాడూ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా..కాంగ్రెస్ ఆరోపణలకే పరిమితమైతే తెలంగాణ ప్రజలు నష్టపోతారన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉందని.. 10 ఏళ్లలో తెలంగాణలో దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా నిధులిచ్చిందని బండి సంజయ్ చెప్పారు.

## మధ్యప్రదేశ్‌లో అడుగుపెట్టనున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'

భోపాల్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' శనివారం మోరీనా జిల్లా మీదుగా మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించనుంది. ఐదు రోజుల విరామం తర్వాత, యాత్ర శనివారం రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ నుండి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేష్ మీడియాతో మాట్లాడుతూ, ఐదు రోజులు (ఫిబ్రవరి 26 నుండి మార్చి 1 వరకు) విశ్రాంతి తీసుకున్న తర్వాత, మేము ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ నుండి భారత్ జోడో న్యాయ్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నాము.ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు మధ్యప్రదేశ్‌లోని మోరేనాలో ప్రవేశిస్తాం, మార్చి 6 వరకు రాష్ట్రంలోనే ఉంటాం. మార్చి 5న ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయంలో రాహుల్ గాంధీ దర్శనం చేసుకోనున్నారు. మార్చి 7న గుజరాత్‌లోకి ప్రవేశిస్తాం. యాత్రలో ప్రజలు మాకు మద్దతు ఇస్తున్నారు.

## ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాద రావు జయంతి వేడుకలు

వరంగల్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ననుసరించి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో మాజీ స్పీకర్ శ్రీపాద రావు చిత్రపటానికిఅదనపు కలెక్టర్ సంధ్యారాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంథని ఎమ్మెల్యేగా, శాసనసభ స్పీకర్ గా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధి కోసం, కోల్ బెల్ట్ పారిశ్రామిక ప్రాంతంలో ఘనమైన అభివృద్ధి చేశారని ఆయన సేవలను స్మరించుకొన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏ.ఓ. శ్రీకాంత్, ఎలక్షన్ సూపరిండెంట్ విశ్వ నారాయణ కలెక్టరేట్ విభాగాల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## 'బెస్ట్ ఎడ్యుకేషన్‌కు భారత్ డెస్టినేషన్'.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి..

హైదరాబాద్, మార్చి 2 ,వికసిత్ భారత్ పేరుతో ప్రజల నుంచి సూచనలు స్వీకరించనుంది బిజెపి. ప్రజల నుంచి వచ్చిన సూచనలతో బిజెపి మానిఫెస్టో రూపకల్పన చేస్తామన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.ఈ నెల 15 వరకు సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు తెలిపారాయన. ఈ సందర్భంగా వికసిత్ భారత్ పోస్టర్?ను విడుదల చేశారు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. అభివృద్ధి చెందిన భారతానికి మన మోదీ గ్యారంటీ అంటూ నినదించారు. రాష్ట్రంలో బిజెపి విజయ సంకల్ప యాత్రకు విశేష స్పందన వస్తోందన్నారు.



రాష్ట్రంలో మెజారిటీ లోక్ సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు. 2047 నాటికి దేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ గా ఉండాలన్నది మోడీ విజన్ అని ప్రజలకు దిశానిర్దేశం చేశారు.బెస్ట్ ఎడ్యుకేషన్ కు భారత్ డెస్టినేషన్?గా ఉండాలి. విద్య, ఉపాధి, మౌళిక సదుపాయాలకు 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ నెం.1 గా ఉండాలని కాంక్షించారు. అలాంటి వికసిత్ భారత్ రూపకల్పనకు ప్రజల నుంచి సలహాలు తీసుకుంటున్నామన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. రెండు రకాల మానిఫెస్టోలు రిలీజ్ చేస్తాం.. అందులో ఒకటి వచ్చే ఐదేళ్ల కోసం.. రెండోది 2047 విజన్ కోసం అని స్పష్టం చేశారు. పద్మ అవార్డులు కూడా ప్రజల సలహాలతోనే ఇస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో సలహాల బాక్స్?లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ ఎన్నికల్లో 'మరోసారి మోదీ సర్కారు' అనేది తమ పార్టీ నినాదం అని చెప్పారు. బిజెపికి ప్రజలు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాం.. ప్రధాని మోడీ 4న అదిలాబాద్, 5న సంగారెడ్డిలో పర్యటిస్తారన్నారు. ఆదిలాబాద్?లో రూ. 6,697 కోట్లు, సంగారెడ్డిలో రూ. 9,021 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేశంలో బిజెపి మినహా అన్ని పార్టీలు కుటుంబ పార్టీలే అన్నారు.

## టీఎంసీ అంటేనే అవినీతి: ప్రధాని మోదీ



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విమర్శలు చేశారు. బెంగాల్‌లో మొత్తం 42 సిట్లతో బీజేపీ విజయం సాధించాలనే లక్ష్యంతో టీఎంసీని ప్రధాని మోదీ టార్గెట్ చేశారు.ఆయన శనివారం బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. 'టీఎంసీ అంటేనే అవినీతి. ఇక్కడికి వచ్చిన ప్రజలు ఇచ్చిన విశ్వాసంతో చెబుతున్నా.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కార్ 400 స్థానాల్లో విజయం సాధిస్తుంది. టీఎంసీ అంటే దౌర్జన్యాలు, కుటుంబ రాజకీయం, దోహానికి ప్రతిరూపం. బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పట్ల విసుగు చెందారు.సందేశ్‌ఖాలీ మహిళల విషయాన్ని ప్రస్తావిస్తూ... టీఎంసీ నేతలు సందేశ్‌ఖాలీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. బాధలో ఉన్న తల్లులు సోదరీమణులకు మద్దతు ఇవ్వాల్సింది పో?యి టీఎంసీ ప్రభుత్వం నిందితుల పక్షాన నిలబడుతోందని మోదీ విమర్శించారు. న్యాయం కోసం సందేశ్‌ఖాలీ మహిళలు ఎంత వేడుకుంటున్నా, నిరసనలు తెలిపినా టీఎంసీ ప్రభుత్వం మాత్రం వినిపించుకోలేదని మోదీ మండిపడ్డారు.

## టీఎస్ఆర్టిసికి 5 జాతీయ అవార్డులు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)కి జాతీయ స్థాయి అవార్డుల పంట పండింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక ఐదు నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులు సంస్థకు వరించాయి. 2022-23 ఏడాదికి గాను రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత



వినియోగం, తదితర కేటగిరిల్లో ఈ జాతీయ స్థాయి పురస్కారాలు టీఎస్ఆర్టీసీకి దక్కాయి.రహదారి భద్రతలో ప్రథమ బహుమతి, ఇంధన సామర్థ్య నిర్వహణ మొఫిషిల్ విభాగంలో ప్రథమ, అర్బన్ విభాగంలో ద్వితీయ బహుమతిని టీఎస్ఆర్టీసీ కైవసం చేసుకుంది. సిబ్బంది సంక్షేమం, ఉత్పత్తి కేటగిరిలో ప్రథమ, సాంకేతికత ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందించినందుకు గాను మరో ప్రథమ బహుమతిని టీఎస్ఆర్టీసీ గెలుచుకుంది. ఐదు అవార్డులను న్యూఢిల్లీలో ఈ నెల 15న టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు ఏఎస్ఆర్టీయూ ప్రకటించింది.

# శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

## గాలిలో ప్రజా ఆరోగ్య భద్రత

తినే తిండి, పీల్చేగాలి, తాగే నీరు సురక్షితంగా, నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోనివారుండరు. మనిషికి కనీస అవసరాలైన ఇందులోని ఏఒక్కటి కల్తీ అయినా అది ప్రాణాలకే ప్రమాదం..ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తువులను కృత్రిమంగా తయారు చేసి.. కల్తీని ప్రజలకు విక్రయిస్తున్నారు. మరోపక్క నగరంలోని హోటళ్లలో కూడా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. కల్తీ ఆహారపదార్థాల బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా.. అధికార యంత్రాంగం నిద్ర మత్తులో ఉన్నదని విమర్శలొస్తున్నాయి. నకిలీ కొబ్బరి నూనె, మసాల, కిరాణా సరకులకు సంబంధించిన గుట్టును రట్టు చేశారు. కానీ, స్వార్థమే పరమావధి, లాభాలే అసలైన లక్ష్యంగా మారిన సమాజంలో సర్వం కల్తీమయం చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. ఆహారపదార్థాల్లో ఉపయోగించే మాసాల దినుసుల్లోని గసగసాలు, మిర్యాలు, లవంగాలు, డ్రైఫ్రూట్స్, పిండి, బియ్యం.. అన్ని రకాల వస్తువులు నకిలీవి చేస్తున్నారు.మానవాళికే ప్రమాదకరంగా మారిన ఈ కల్తీని సమర్థవంతంగా నిరోధించి, కల్తీసురుల ఆటకట్టించే చట్టాలే కరువయ్యాయి. కోటికి పైగా జనాభా వున్న హైదరాబాద్‌లో గడిచిన రోజు ఓ అంతర్జాతీయ ప్రముఖ కంపెనీ చాక్లెట్‌లో తెల్లపురుగు వుందని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాల నిర్ధారించడం, బేగంబజార్ కేంద్రంగా రూ. 5 లక్షలు విలువ చేసే అల్లం, వెల్లుల్లి కల్తీ పేస్టు ముఠాను పట్టుకోవడం సర్వం కల్తీమయాన్ని నిరూపిస్తున్నది.నేషనల్ క్రైమ్స్ బ్యూరో ఇటీవల 19 నగరాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేయగా హైదరాబాద్ దేశంలోనే 246 కేసులతో అగ్రస్థానంలో నిలిచిందని, ఇది దేశ వ్యాప్త కేసుల్లో 84 శాతమని బ్యూరో గణాంకాలతో సహా ప్రకటించడం ఆరోగ్యరంగ నిపుణులను ఆందోళనపరుస్తోంది. ఇంటి బయట ఏది తినాలన్నా కల్తీ భయం సాధారణ ప్రజలను తీవ్రంగా కలవరపరుస్తున్నది. అత్యధిక జనసాంద్రత, వేలాది హోటళ్ళున్న హైదరాబాద్‌లో ఆహార కల్తీని నిరోధించే అధికారులు కేవలం 30 మంది మాత్రమే ఉన్నారంటే నియంత్రణ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వం కల్తీతో పాలితులు కల్తీ ఆహారం తిని కడుపు సంబంధిత వ్యాధులు, కేన్సర్, డయాబెటిస్, గుండె వైఫల్యం, పెరాలసిస్ వంటి సుదీర్ఘ జబ్బులతో బాధితులుగా మారినా పాలకుల్లో ఆహార కల్తీ నియంత్రణపై చీమకుట్టినట్లయిన లేకపోవడం, అధికారులు మౌన ప్రేక్షకుల్లా మూగనోము పాటించడం క్షమించరాని నేరమే. 2006లోనే ఆహార భద్రత, ప్రమాణాల చట్టం తీసుకు వచ్చినా అది కాగితాలకే పరిమితమైంది. వీధి ఆహార దుకాణాల నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ళ దాకా కల్తీసురులు చట్టంపై భయంలేక విశృంఖలంగా వీరవిహారం చేస్తున్నారు.సహజ సిద్ధంగా పొలాల్లో పండిన పంటల నుంచి వచ్చే ఆహార పదార్థాలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అయితే, ఈ సహజ సిద్ధంగా పండే పంటల నుంచి వచ్చే ఆహారపదార్థాలు కాకుండా.. కొందరు కృత్రిమంగానే తయారు చేస్తున్నారు. ఇందుకు కొన్ని కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారు, హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి.. ఈ నకిలీ వస్తువులు తయారు చేస్తున్నారు. జిలకర్ర, సాజిర, బాదం, లవంగాలు, ఇలాచీలు, గసగసాలు, మిర్యాలు, కర్రం పొడి, పసుపు, గోదుమ పిండి, నూడిల్స్.. ఇలా ఒకటేమిటి ఇంటిలోని వంట గదిలో ఉండే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే వస్తువులన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. మేమున్నామంటూ.. అప్పడప్పుడు పోలీసులు దాడులు చేస్తుంటారు. ఏడాదికోసారి ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా.. మేం సైతం.. అంటూ దాడులు చేస్తుంటారు. పూర్తిస్థాయిలో మాత్రం అటు పోలీసులు, ఇటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన వాళ్లే కృత్రిమంగా నకిలీ పదార్థాలు తయారు చేస్తూ.. విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీకి వాడిన నాసిరకం ముడిపదార్థాలు, వాటికి రంగు, రుచి, వాసన రావడానికి వాడిన కెమికల్స్, అవి తయారైన పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తే ఒళ్ళుగగుర్పొడుస్తోంది. కల్తీ తయారీదారులు అల్లం, వెల్లుల్లి పేస్టును బ్రాండ్ల పేరు, ఐఎస్ఐ ముద్రతోనే రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న స్టోర్లకు కూడా పంపిణీ చేస్తున్నారని పోలీసులు చేసిన ప్రకటన చూస్తే వణికిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, వెన్న, మయోనీజ్, సాస్, కోవా, బియ్యం, చాక్లెట్లు లాంటి నిత్యావసర వస్తువుల నాణ్యతపై హైదరాబాద్ నగర పాలక సంస్థ ఆహార కల్తీ నిరోధక విభాగానికి ప్రతి రోజూ వందలాది ఫిర్యాదులు అందుతున్నాయంటే కల్తీ తీవ్రత ఎంతగా విస్తృతమవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఆహార కల్తీని కూడా విధాన నిర్ణేతలు ప్రాధాన్యతా అంశంగా తీసుకొని వివిధ దేశాల్లో ఆదర్శప్రాయంగా వున్న చట్టాలను అక్కడి మాదిరిగా సంస్కరించి కఠిన శిక్షలు కల్తీసురులకు పడే విధంగా చూస్తే తప్ప కల్తీల ఆగడాలు ఆగవు.ఆహార కల్తీ చట్టం, అందులో భాగంగా ఏర్పాటైన యంత్రాంగాలు వీధివీధినా పెరిగిన ఆహార కేంద్రాలను ఎప్పటికప్పుడు నిఘా పెట్టి తనిఖీ చేసే పరిస్థితులు లేవు. పాలకులే మేల్కొని ఆహార కల్తీ నిరోధాన్ని అత్యవసరంగా తీసుకొని అందుకు తగిన కఠిన కార్యాచరణ అవలంబిస్తే తప్ప కల్తీ మహమ్మారిని పారద్రోలలేము. ఇప్పుడు సరైన యంత్రాంగం లేక అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఆహార కల్తీ నిరోధక అధికారులు చేసే తనిఖీలు, పెట్టే కేసులు తూతూ మంత్రంగానే వున్నాయి.

# లహరి బస్సులకు విపరీత స్పందన




అదిలాబాద్, మార్చి 2 (న్యూస్ పల్స్) దూర ప్రాంత ప్రయాణాల్లో సౌకర్యం కోరుకునే వారికి తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ లహరి సర్వీసులు వరంగా మారుతున్నాయి. సుఖ ప్రయాణాన్ని కోరుకునే వారు ఇప్పటి వరకు ప్రైవేట్ సర్వీసుల్ని ఆశ్రయిస్తున్నారు.దూరప్రాంత ప్రయాణాలకు ఇన్నాళ్లు ప్రైవేటు సర్వీసులను ఆశ్రయించిన వారిని ఆకట్టుకునేందుకు ఆర్టీసి ప్రయత్నాలు చేస్తోంది. ప్రైవట్ సర్వీసుల్లో ఏసీ, నాన్‌ఏసీ విభాగాల్లో స్లీపర్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకు రావడంతో ఎక్కువ మంది వాటిని ఆశ్రయిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆర్టీసీ సైతం ఈ మార్పును అందిపు చ్చుకోవాలని, ప్రయాణికులకు మరింత మెరు గైన సేవలను అందించేందుకు ప్రయత్నిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పెద్దదైన డిపోగా పేరున్న నిర్మల్ కూడా ఇందుకు తగిన సౌకర్యాలు కల్పిస్తుంది.అధికారుల చొరవతో నిర్మల్ డిపోలో మొత్తం 10 ఆధునిక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చారు. కుదుపులు లేని ప్రయాణం లహరి.. పేరిట తీసుకొచ్చిన ఈ స్లీపర్ కోచ్ బస్సులు ప్రయాణికులకు మరింత మెరుగైన అనుభూతినిస్తుంది.2 ఏసీ, 8 నాన్ ఏసీ లహరి బస్సులు ఇప్పటికే నిర్మల్ డిపోకు చేరుకున్నాయి. ఏసీ బస్సులను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సర్వీసులకు వినియోగిస్తున్నారు. నాన్ ఏసీ బస్సులను విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కనిగిరి, పామూరు, వింజమూరు, కందుకూరు ప్రాంతాలకు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.నిర్మల్ ప్రాంతంలో ఆంధ్రా నుంచి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉంటారు. వీరిలో చాలా మంది ప్రయాణంలో సౌఖ్యం కోసం ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సు లను ఆశ్రయించే వారు. ఇప్పుడా అవసరం లేకుండా ఆర్టీసీనే ఆధునిక బస్సులను నడుపు తోంది.ఆధునిక పరిజ్ఞానంతో తయారైన ఈ సర్వీసుల్లో ఎలాంటి

కుదుపుల్లేకుండా ఆహ్లాదకర ప్రయాణం అనుభూతి చెందొచ్చు. ఈ బస్సుల్లో 47 సీట్లుంటాయి. ఇందులో 32 సీట్లు కూర్చొని ప్రయాణించేందుకు కాగా, మిగతావి పడుకునేందుకు బెర్తుల్లాగా ఉంటాయి. బస్సు ఎక్కడ ఆగిందో తెలిపేలా స్పీకర్ అనౌన్స్మెంట్ వస్తుంది. బస్సులో రివర్స్ కెమెరాతో పాటు లోపల కూడా సీసీ కెమెరా ఏర్పాటు చేశారు.ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్మల్ డిపోకు ప్రజా దరణ ఎక్కువగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు వివరిస్తున్నారు. అత్యాధునిక లహరి బస్సు సర్వీసులు సైతం 10 వచ్చాయి. వీటిని దూరప్రాంతాల ప్రయాణికుల సౌలభ్యం కోసం సిద్ధం చేశామని డిపో మేనేజర్ ప్రతిమా వివరించారు.లహరి సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందని ఎలాంటి సమాచారం కావాలన్నా 73828 42582 నంబరులో సంప్రదించొచ్చన్నారు. ఏసీ, నాన్ ఏసీ విభాగాల్లో ఈ బస్సులు కొనసాగుతున్నాయని తెలిపారు.బస్సుల్లో ప్రయాణికుల సౌలభ్యం కోసం అన్నిరకాల ఏర్పాట్లు చేశామని, డ్రైవింగ్‌లో అనుభవం, నైపుణ్యం ఉన్నవారు బస్సులు నడుపుతుండటం వల్ల భద్రతపై మరింత భరోసా లభిస్తుందని చెబుతున్నారు.

# నీళ్లే అజెండాగా గులాబీ ప్లాన్

హైదరాబాద్, మార్చి 2 లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో తెలంగాణలో రెండు జాతీయ పార్టీల కన్నా ఎక్కువగా ఒత్తిడికి గురవుతోంది భారత రాష్ట్ర సమితి. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వల్ల ఎలాంటి ప్లస్ పాయింట్లు ఉంటాయని కేసీఆర్ అంచనా వేసుకున్నారో ఇప్పుడు.. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం అంతగా మైనస్ అవుతోంది. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు, బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడం .. మరితం టెన్షన్‌కు గురి చేస్తున్నాయి. ఈ సమయంలో బలంగా ప్రజల్లోకి వెళ్లడానికి ఓ అజెండా కూడా కరవైంది. కానీ ..తెలంగాణ ఉద్యమంలో కీలకమైన నీళ్ల అజెండాతోనే వెళ్లాలని డిసైడయ్యారు. కాళేశ్వరం విషయంలో తాము చేసిన కృషిని తక్కువ చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ ప్రజల్లోకి వెళ్లాలని డిసైడయ్యారు. తెలంగాణ ఉద్యమం నాటి నినాదమే నేటి ఓట్లనాదమైంది. ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు- నినాదం మార్మోగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా- ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు- నినాదం మార్మోగుతూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాటర్ వార్ ఓ రేంజ్ కి వెళ్లింది. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను టార్గెట్‌గా చేసుకొని విమర్శలు చేస్తోంది. ఇప్పుడు అదే ప్రాజెక్టును ఆయుధంగా చేసుకొని హస్తం పార్టీపై కౌంటర్ అటాక్ ప్రారంభించింది గులాబీ పార్టీ. ఇందులో భాగంగా మార్చి 1 నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చిన బీఆర్ఎస్.. కాళేశ్వరం సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదే సమయంలో నీటి పోరు యాత్రలో భాగంగా కరీంనగర్‌లో భారీ బహిరంగ సభకు కూడా ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల సందర్శన పేరిట ప్రజాక్షేత్రంలోకి దిగనుంది. బహుశా ఎన్నికలయ్యేంత వరకు ఈ కార్యాచరణ కొనసాగుతుందని అంచనా. కృష్ణా జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఇటీవల నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గిన కాంగ్రెస్.. కృష్ణా జలాలపై హక్కులను కోల్పోయేలా చేసిందని ఆరోపించింది. ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నీటి పోరు యాత్రలకు పిలుపునిచ్చింది బీఆర్ఎస్. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసింది. అయితే.. ఈ ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికలకు ముందు కుంగిపోయిన విషయం వెలుగు చూసింది. అప్పటినుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేందుకు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం విడుదల చేసింది. 'కాళేశ్వరం ఓ విఫల ప్రాజెక్టు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. కాళేశ్వరం బీఆర్ఎస్ అవినీతికి పెద్ద ప్రాజెక్ట్. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలి' అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి..

బ్యారేజీలోని లోపాలను ఎత్తిచూపారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ మాత్రమే కాదని, ప్రాజెక్టులో ఇది ఒక బ్యారేజీ మాత్రమేనని చెబుతోంది బీఆర్ఎస్. ఈ క్రమంలోనే మార్చి ఒకటో తేదీ నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చింది బీఆర్ఎస్. 150 నుంచి 200 మంది బీఆర్ఎస్ ప్రతినిధులతో మేడిగడ్డను సందర్శించి... వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని ప్రకటించారు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అంతేకాదు.. తమ వెంట సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఎవరైనా రావొచ్చని పిలుపునిచ్చారు. కానీ కేసీఆర్ ను తీసుకెళ్లాలని కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు చేస్తున్న ప్రభుత్వం.. ఎలాంటి విచారణ అయినా జరుపుకోవచ్చని ప్రకటించింది బీఆర్ఎస్. మేడిగడ్డలో కొంత భాగం దెబ్బతిన్నప్పటికీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందంటున్న గులాబీ పార్టీ.. ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టాలని హితవు పలుకుతోంది. గోదావరి జలాల వినియోగంపై చేపట్టనున్న నీటి పోరు యాత్రలో భాగంగా.. మార్చి 10న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ సభ ద్వారా పార్లమెంట్ ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించనున్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లేలా దశలవారీ కార్యక్రమాలకు పిలుపిచ్చింది. మేడిగడ్డ తర్వాత మిగతా బ్యారేజీలు, రిజర్వాయర్లను కూడా సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎలా చూసినా బీఆర్ఎస్ ఈ సారి నీళ్లతో ఓట్ల పంట పండించాలని అనుకుంటుంది. కానీ ఆ సెంటిమెంట్ రేపడం.. అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే ఇప్పుడు తెలంగాణ స్వయం పాలనలో ఉంది.

# ఈ అంశంలో బీజేపీ రాజకీయాలు చేయడం తగదు.. పేలుడు ఘటనపై సీఎం సిద్ధరామయ్య

కర్ణాటక రాజధాని బెంగళూరులోని ప్రముఖ రెస్టారెంట్ రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం బాంబ్ బ్లాస్ట్ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ పేలుడులో మొత్తం 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుడు ఘటనపై సీఎం సిద్ధరామయ్య తాజాగా స్పందించారు. బస్సులో రామేశ్వరం కేఫ్‌కు వచ్చిన ఓ వ్యక్తి ఈ పేలుడుకు పాల్పడ్డాడని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై బీజేపీ రాజకీయాలు చేస్తోందని




మండిపడ్డారు.శనివారం ఉదయం మైసూర్‌లో మీడియాతో సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. మాస్క్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి బస్సులో ప్రయాణించి కేఫ్‌కు వచ్చినట్లు చెప్పారు. రవ్వ ఇడ్లీని ఆర్డర్ చేసుకొని ఒక దగ్గర కూర్చున్నాడని.. ఆ తర్వాత తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లోని బాంబుకు టైమర్ సెట్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని వివరించారు. అతడు ఎవరో తెలీలేదని, సాధ్యమైనంత త్వరగా నిందితుడిని పట్టుకుంటామన్నారు. పేలుడులో గాయపడి వారు ప్రస్తుతం కోలుకుంటున్నట్లు చెప్పారు. నిన్న డిప్యూటీ సీఎం, హోం మినిస్టర్ ఘటనాస్థలిని పరిశీలించినట్లు చెప్పారు. ఇవాళ తాను కూడా ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించనున్నట్లు చెప్పారు. అదే విధంగా పేలుడు ఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించనున్నట్లు వెల్లడించారు.అయితే ఈ విషయంలో బీజేపీ రాజకీయాలు చేస్తోందని సిద్ధరామయ్య మండిపడ్డారు. వారి హయాంలో కూడా బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. అప్పుడు వారు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడ్డారా..? అని ప్రశ్నించారు. దీనిపై రాజకీయం చేయకూడదని వ్యాఖ్యానించారు. పేలుడు ఘటనపై సీరియస్‌గా దర్యాప్తు జరుగుతోందన్నారు. దర్యాప్తు అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు.

# ప్రజావాణి కార్యక్రమంలో ఈ సమస్యలపైనే ఎక్కువ దరఖాస్తులు..

హైదరాబాద్, మార్చి 02: మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్?లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1509 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 275 దరఖాస్తులు, రేషన్ కార్డుల కొరకు 107, ఇందిరమ్మ ఇండ్ల కోసం 396 దరఖాస్తులు ఉన్నాయి.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి, సిడియంఎ దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. కేవలం వ్యక్తిగత దరఖాస్తులే కాకుండా వివిధ ఉద్యోగ సంఘాల నుండి కూడా దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అందులో ముఖ్యంగా డిఎస్?సి 2008 బిఈడీ మెరిట్ అభ్యర్థుల సంఘం నాయకులు శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర తీర్పు అమలు చేసి డిఎస్?సి 2008 నోటిఫికేషన్ ప్రకారం కామన్ మెరిట్?లో సెలక్ట్ అయ్యి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని కోరారు. వారి సమస్యను విని సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వ పాఠశాలలో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు బోధన చేస్తున్న ( ఎఇఖీఖ ) కాంట్రాక్ట్ టీచర్ల సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

# సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం.. ముఖ్యమైన తేదీలు




తెలంగాణలోని కొత్తగూడెంలో ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్.. సింగరేణి బొగ్గు గనుల సంస్థల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేష్ విడుదల చేసింది.

మొత్తం 272 ఎగ్జిక్యూటివ్ కేడర్/ నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మార్చి 1 నుంచి 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు..

ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల వివరాలు:

మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్), ఈ2 గ్రేడ్ పోస్టులు: 139
మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్ పోస్టులు: 22
మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్), ఈ2 గ్రేడ్ పోస్టులు: 22
మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఐఈ), ఈ2 గ్రేడ్ పోస్టులు: 10
జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్ పోస్టులు: 10
మేనేజ్‌మెంట్ ట్రైనీ (హైడ్రో-జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్ పోస్టులు: 2
మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్), ఈ2 గ్రేడ్ పోస్టులు: 18
జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్ పోస్టులు: 3
జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్ పోస్టులు: 30
నాన్-ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో సబ్-ఓవర్సీర్ ట్రైనీ (సివిల్), టి అండ్ ఎస్ గ్రేడ్-సి పోస్టులు: 16

ఆయా పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్/ బీఎస్సీలో ఇంజినీరింగ్, సీఏ/ఐసీడబ్ల్యూఏ/ సీఎంఏ / డిగ్రీ / పీజీ డిప్లొమా / ఎంబీఏ / ఎంఎస్సీ / ఎంబీబీఎస్ / డిప్లొమా లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత పొంది ఉండాలి. వైద్యాధికారి పోస్టులకు మినహా మిగిలిన అన్ని పోస్టులకు గరిష్ట వయోపరిమితిపి 30 ఏళ్లుగా నిర్ణయించారు. వైద్యాధికారి పోస్టుల (జీడీఎంవో పోస్టులు)కు 45 ఏళ్లుగా గరిష్ట వయోపరిమితిని ఇచ్చారు. మిగిలిన అన్ని పోస్టులకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 ఏళ్ల వరకు వయోపరిమితిలో మినహాయింపు ఇచ్చారు. రిక్రూట్‌మెంట్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ల వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఇతర వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు.

ముఖ్యమైన తేదీల వివరాలు..

ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణకు ప్రారంభ తేదీ: మార్చి 01, 2024.
ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ: మార్చి 18, 2024.
పూర్తి వివరాలకు క్లిక్ చేయండి.

# కోడి మాంసం తినలేదని కొడుకుని చితకబాదిన తండ్రి



ఖమ్మం : పిల్లలు తమకు నచ్చిన ఆహారాన్ని తినేందుకు మాత్రమే ఇష్టపడుతుంటారు. నచ్చని కూర వండితే ఆ రోజు అన్నమే తినరు. ఉపవాసమైనా ఉంటారు.. కానీ ఆ వంట వాసన కూడా చూడరు. అయితే ఓ పిల్లాడు కూడా కోడి మాంసానికి దూరంగా ఉన్నాడు. కోడి కూర ఎందుకు తినడం లేదని ఆ పిల్లాడిని తండ్రి చితకబాదాడు.వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో శ్రీనివాస్ అనే వ్యక్తి నిన్న చికెన్ తీసుకొచ్చాడు. ఇక వంట చేసిన తర్వాత శ్రీనివాస్ కుమారుడు మురళి(9) మాత్రం ఆ చికెన్ తినలేదు. దీంతో తండ్రి తీవ్ర ఆగ్రహానికి గురై కుమారుడిని విచక్షణారహితంగా చితకబాదాడు. శరీరమంతా వాపు వచ్చింది. నిన్న సాయంత్రం విషయం తెలుసుకున్న తల్లి మహేశ్వరి కుమారుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించింది. ఆ తర్వాత భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# దామోదర్ రావు మాతృమూర్తి ఆండాళమ్మ మృతిపట్ల కేసీఆర్ సంతాపం

హైదరాబాద్ : రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్ రావు మాతృమూర్తి ఆండాళమ్మ మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. దామోదర్ రావు కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆండాళమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ప్రార్థించారు.ఆండాళమ్మ మాతృమూర్తి పార్థివదేహానికి ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సంజయ్ కుమార్, కేటీఆర్, ఎంపీలు కేశవరావు, సంతోష్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు నివాళు లర్పించారు. దామోదర్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.





# సినీ ప్రస్థానం

## 'నాగసాధు'గా అందాల ముద్దుగుమ్మను చూడగలమా?

మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతోంది. ఈ రెండు దశాబ్దాల కాలంలో తమన్నా ఎన్నో రకాల పాత్రల్లో నటించింది. అయితే ఆమె గెటప్ ఎప్పుడూ కూడా ఒకే మాదిరిగా ఉంటూ వచ్చింది. ఎక్కువ శాతం గ్లామర్ షో, స్కిన్ షో పాత్రలకే ప్రాముఖ్యత ఇస్తూ వచ్చింది. తమన్నా కెరీర్ ఈ మధ్య కాలంలో కాస్త డల్ అయ్యింది. దాంతో ఈ అమ్మడు చేతికి అంది వచ్చిన పాత్రలన్నింటిని చేస్తూ వస్తోంది. తాజాగా ఓదెలా 2 అనే నేచురల్ హర్రర్ థ్రిల్లర్ మూవీలో నటించేందుకు ఒప్పుకుంది. సంపత్ నంది ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాని కశ్మీర్ లో ప్రారంభించారు. అశోక్ తేజ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఓదెలా 2 లో తమన్నాను నాగ సాధు పాత్రలో చూడబోతున్నాం. శివ శక్తి పాత్ర లో తమన్నా నటించేందుకు ఓకే చెప్పి అందరిని ఆశ్చర్య పరిచింది. ఇప్పటి వరకు కనిపించినట్లుగా గ్లామర్ గా ఈ సినిమాలో కనిపించే అవకాశం లేదు. తమన్నాను ఇన్నాళ్లు గ్లామర్ గా చూసిన వారు శివ శక్తి పాత్రలో చూసి ఒప్పుకుంటారా అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా అంటే ఆమె అందం కోసమే చాలా మంది ఫ్యాన్స్ వెళ్తారు. అలాంటిది మిల్కీ బ్యూటీ తమన్నా ను నాగ సాధుగా చూపిస్తే ఎంత వరకు సినిమాను చూసేందుకు వెళ్తారు అంటూ కొందరు మీడియా వర్గాల వారు చర్చించుకుంటున్నారు. కాన్సెప్ట్ బాగుంటే తమన్నా ను ఎలా చూపించినా ప్రేక్షకులు థియేటర్ల ముందు క్యూ కట్టడం ఖాయం అని మరి కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఓదెలా 2 లో మిల్కీ బ్యూటీ తమన్నాను కొత్త అవతారంలో చూడబోతున్నాం.

## వైమానిక దళ ఆపరేషన్ ఆధారంగా ఆపరేషన్ వాలెంటైన్

తెలుగులో ఎయిర్ ఫోర్స్ యుద్ధం నేపథ్యంలో సినిమాలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు వరుణ్ తేజ్ ఈ యుద్ధ నేపథ్యంలో 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చాడు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాతో వరుణ్ తేజ్ హిందీలో అరంగేట్రం చేస్తున్నాడు. మానుషి చిల్లర్ ఇందులో కథానాయక. ఈ సినిమాలో హిందీ తెలుగు నటులు మిశ్రమంగా కనిపిస్తారు. అర్జున్ రుద్ర దేవ్ అలియాస్ రుద్ర భారత వైమానిక దళంలో స్క్వాడ్రన్ లీడర్, యుద్ధ పైలట్ కూడా. ధైర్య సాహసాలకు పెట్టింది పేరు, దానివలన అప్పుడప్పుడు పై అధికారులతో చివాట్లు కూడా తింటూ ఉంటాడు. అతని ప్రియురాలు అహన (మానుషి చిల్లర్) రాడార్ ఆపరేటర్ గా వైమానిక దళంలోనే పనిచేస్తూ ఉంటుంది. అర్జున్ ప్రాజెక్ట్ వజ్ర సరిగా పని చేస్తోందో లేదో అని టెస్ట్ చేసే సమయంలో అతని మిత్రుడు (నవదీప్) ని కోల్పోతాడు. ఆ తరువాత పాకిస్తాన్ కి చెందిన టెర్రరిస్టులు భారత సైనికులను తీసుకు వెళుతున్న ట్రక్కులపై దాడి చేస్తారు, ఇందులో 40 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోతారు. దీనికి ప్రతిగా భారత వైమానిక దళం ఒక ఆపరేషన్ ప్లాన్ చేస్తుంది. ఏంటి ఆ ఆపరేషన్, అది ఎలా అమలు చేస్తారు, వజ్ర ప్రాజెక్ట్ నేపథ్యం ఏంటివన్నీ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాగా మలిచారు. ఈ కథ నిజ సంఘటనల ఆధారంగా తీసిన కథ. పాకిస్తాన్ టెర్రరిస్టులు జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా దాడిలో 40 మంది భారత సైనికులను పొట్టను పెట్టుకున్న ఉదంతం అందరికీ తెలిసినదే. దానికి ప్రతిగా భారత వైమానిక దళం పాకిస్థాన్లోని టెర్రరిస్ట్ క్యాంపులను విచ్ఛిన్నం చేసిన సంగతి కూడా తెలిసిందే. ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమా ఈ కథ ఆ సంఘటన ఆధారంగా తీసుకున్నదే. అయితే తెలుగులో ఇలాంటి యుద్ధ నేపథ్యం ఉన్న సినిమా రావటం ఇదే మొదటిసారి. ఇలాంటి సినిమాలు చేయాలంటే చాలా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవసరం, ప్రేక్షకులకి నమ్మించే విధంగా కూడా ఉండాలి, అలాంటి సన్నివేశాలు కూడా చూపించగలగాలి. ఇవన్నీ కాకుండా దేశభక్తి అనే భావోద్వేగంతో పాటు మనుషుల మధ్య కూడా ఆ భావోద్వేగాలు కనిపించాలి. అప్పుడే ఈ తరహా సినిమాలు విజయం సాధిస్తాయి. ఇక ఈ ఆపరేషన్ వాలెంటైన్ సినిమాకు వస్తే దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ తన పరిధి మేరకు చేసాడు అని చెప్పొచ్చు, అక్కడక్కడ చిన్న చిన్న లోటుపాట్లు వున్నా తెలుగు సినిమాలో ఇటువంటి కథా నేపథ్యం ఉన్న సినిమా తీయడం హర్షించదగ్గ విషయమే. ఇంతకుముందు హృతిక్ రోషన్, దీపికా పదుకొనే జంటగా నటించిన 'ఫైటర్' సినిమా కూడా ఇటువంటి కథా నేపథ్యం ఉన్న సినిమా అవడం ఆసక్తికరం. ఇప్పుడు ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమా కూడా అదే నేపథ్యంలో వచ్చింది. ఇందులో దేశభక్తి కనిపిస్తుంది కానీ సినిమాలో భావోద్వేగాలు అంతగా కనిపించవు, కొన్ని దగ్గర్ల మరీ గ్రాఫిక్స్ అని అర్థం అయిపోతుంది. ఇది వ్యాపారాత్మకంగా నడుస్తుందా నడవదా అన్న విషయాన్ని పక్కన పెడితే వరుణ్ తేజ్ లాంటి నటుడు ఇలాంటి సినిమాతో ముందుకు రావడం హర్షణీయం.




## కలియుగం పట్టణంలో...కొత్త తరం మూవీ

నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా 'కలియుగం పట్టణంలో' అనే ఓ డిఫరెంట్ మూవీ రాబోతోంది. కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్ ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను రమాకాంత్ రెడ్డి చూసుకుంటున్నారు. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు కలిసి సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. మార్చి 22న రాబోతోన్న ఈ మూవీలో చిత్రా శుక్లా ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఇక ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఆ నలుగురు సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడని.. ఇప్పుడు హీరోగా నటించాడన్నారు. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోందని.. కలియుగం పట్టణంలో అనే టైటిలే చాలా వినూత్నంగా ఉందన్నారు. మార్చి 22న ఈ చిత్రం రాబోతోందని.. ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. డైరెక్టర్ త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ.. 'కలియుగం పట్టణంలో టీజర్ నాకు చూపించారు. నాకు చాలా నచ్చింది. ఏదో చిన్న సినిమాలా అనుకున్నా.. కానీ హై స్టాండర్డ్‌లా అనిపించింది. విశ్వ కార్తికేయ, ఆయుషి జంట చక్కగా ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ ఇవ్వాలి. దర్శక నిర్మాతలకు మంచి పేరు రావాలి.' అని అన్నారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా కలియుగం పట్టణంలో సినిమాను ఆశీర్వదించడానికి వచ్చిన మీడియాకు థాంక్స్. నా సినిమా టీంకు థాంక్స్. మిగతా విషయాలన్నీ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడతాను' అని అన్నారు.



## విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్

రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. గీతగోవిందం సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. ఎస్‌వీసీ బ్యానర్‌లో వస్తున్న 54వ చిత్రమిది. ఈ సినిమా ఏప్రిల్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రయూనిట్ ప్రమోషన్స్ షూరు చేసింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ అప్‌డేట్ ఇచ్చాడు విజయ్ దేవరకొండ. త్వరలోనే టీజర్ రానుంది అంటూ ఎక్స్‌లో రాసుకోచ్చాడు. ఇక ఈ సినిమాలో కుటుంబ బాగోగులు చూసుకునే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవకొండ ఇందులో కనిపించనున్నారు. కూల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్. విజయ్ దేవరకొండ మరోవైపు జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో కూడా నటించనున్నాడు పోలీస్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.




## ఒకే దెబ్బకు మూడు రికార్డులు.. ధర్మశాలలో లెక్కలు మార్చనున్న 41 ఏళ్ల ప్లేయర్..

భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య గురువారం నుంచి 5వ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ధర్మశాలలో జరిగే ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ రాణిస్తే మూడు రికార్డులు లిఖించే అవకాశం ఉంది. ఆ రికార్డులు ఏంటో ఇప్పుడు చూద్దాం.. ఇంగ్లండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను టీమిండియా 3-1 తేడాతో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం సాధించగా, మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో భారత్ వరుసగా విజయం సాధించింది. ఇప్పుడు 5వ మ్యాచ్‌కి ఇరు జట్లు ధర్మశాలలో తలపడేందుకు సిద్ధమయ్యాయి. 700 వికెట్ల ప్రపంచ రికార్డు: టీమిండియాతో జరిగే ఈ మ్యాచ్‌లో జేమ్స్ అండర్సన్ 2 వికెట్లు తీస్తే టెస్ట్ క్రికెట్‌లో 700 వికెట్లు తీసిన ప్రపంచ రికార్డు హోల్డర్‌గా నిలిచాడు జేమ్స్ అండర్సన్. 186 టెస్ట్ మ్యాచ్‌ల నుంచి మొత్తం 698 వికెట్లతో అండర్సన్ టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలుస్తాడు. 150 వికెట్ల ఘనత: భారత్‌పై టెస్ట్ క్రికెట్‌లో 150 వికెట్లు తీయడానికి జేమ్స్ అండర్సన్‌కు కేవలం 3 వికెట్లు మాత్రమే అవసరం. టీమిండియాపై 38 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన జిమ్మీ.. ఇప్పటివరకు 147 వికెట్లు పడగొట్టాడు. 250 వికెట్ల రికార్డు: విదేశీ పిచ్‌లపై 250 టెస్ట్ మ్యాచ్‌లు పూర్తి చేసేందుకు అండర్సన్‌కు ఇంకా 8 వికెట్లు అవసరం. టీమిండియాతో జరుగుతున్న చివరి టెస్ట్ మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లు పడగొట్టితే ప్రత్యేక రికార్డు లిఖించవచ్చు. 41 ఏళ్ల వయసులో కూడా ఫిట్‌గా కనిపిస్తూ ప్రపంచ రికార్డ్‌కు చేరువలో ఉన్నాడు. ధర్మశాలలో భారత్‌తో జరుగుతున్న చివరి టెస్ట్ మ్యాచ్‌లో 2 వికెట్లు పడగొటితే.. 700 వికెట్లు తీసి ప్రత్యేక ఫీట్ సాధించిన లిస్టులో చేరుతాడు. స్క్వాడ్‌లు: భారత జట్టు: యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ(కెప్టెన్), శుభమన్ గిల్, రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్(కీపర్), రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్, అక్షర్ పటేల్, శ్రీకర్ భరత్, వాషింగ్టన్ సుందర్ , దేవదత్ పడిక్కల్, ఆకాష్ దీప్. ఇంగ్లండ్ జట్టు: జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఆలీ పోప్, జో రూట్, జానీ బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్(కెప్టెన్), బెన్ ఫోక్స్(కీపర్), టామ్ హార్ట్లీ, ఆలీ రాబిన్సన్, జేమ్స్ ఆండర్సన్, షోయబ్ బషీర్, మార్క్ వుడ్, రెహాన్ అహ్మద్, డేనియల్ లారెన్స్ , గుస్ అట్కిన్సన్.



## డెకాఫ్ కాఫీ అంటే ఏమిటి? డికాఫినేటెడ్ కాఫీ గర్భిణీలకు సురక్షితమేనా

కాఫీ ఉదయాన్నే గొప్పగా రుచి ఉల్లాసాన్ని ఇస్తుందని భావిస్తారు. ఉదయం నిద్రలేవగానే చాలా మందికి కాఫీ టీలు తాగందే ఇక ఆరోజు ప్రారంభం కాదు. ఒక్క రోజు కాఫీ తాగలేందటే ఇక ఆరోజు ఏదో పోగొట్టుకున్నట్లు నీరసంగా కనబడుతుంటారు. కాఫీ అంత రుచిగా , ఎనర్జిటిక్ గా చేసేది అందులో ఉపయోగించే కెఫిన్. అయితే ఈ కెఫిన్ గర్భిణీలకు సురక్షితమా అన్నది సందేహం. రెగ్యులర్ గా కాఫీతాగే మహిళలు ప్రెగ్నెన్సీకోసం ప్లాన్ చేసుకునే వారు లేదా గర్భం దాల్చిన వారు కాఫీ తాగడం ఎంత వరకు మంచిది. ఇందులో ఉపయోగించే కెఫిన్ వల్ల ఏదైనా ప్రమాదం ఉందా అనేది తెలుసుకోవాలి. కాఫీ తాగే అలవాటు ఉన్న మహిళలు గర్భవతిగా ఉన్నప్పుడు డెకాఫ్ కాఫీ(డికాఫినేటెడ్ )కి మారుతారు, ఎందుకంటే దాని రుచి వారికి ఉదయాన్నే ఓదార్పు మరియు ఉపశమాన్ని కలిగిస్తుంది. కానీ అది ఏమిటి, మరియు గర్భధారణ సమయంలో డెకాఫ్ కాఫీ సురక్షితమా కాదా ఈ కథనంలో తెలుసుకుందాం. డెకాఫ్ కాఫీ అంటే ఏమిటి? డీకాఫిన్ చేసిన కాఫీ లేదా డెకాఫ్ కాఫీ సాధారణ కాఫీకి సమానం, మరియు ఇది 97% కెఫిన్ మాత్రమే తొలగించబడుతుంది. ఇది ప్రారంభంలోనే జరుగుతుంది, అన్‌రోస్ట్ చేయని, ఆకుపచ్చ కాఫీ బీన్స్ వాటి కెఫిన్‌ను ద్రవంలో ముంచడం ద్వారా సేకరించింది. చాలా డెకాఫ్ కాఫీని స్విస్ నీటి ప్రక్రియను ఉపయోగించి తయారు చేస్తారు. ఈ పద్ధతి 1979 లో అభివృద్ధి చేయబడింది మరియు ఎటువంటి ద్రావకాలను ఉపయోగించకుండా కాఫీ నుండి కెఫిన్‌ను తొలగించడానికి సమర్థవంతమైన మార్గం. కాఫీ బీన్స్ కెఫిన్ లేని ఆకుపచ్చ కాఫీ సారంలో నానబెట్టిబడినది, దీనిలో చాలా కెఫిన్ బయటకు వస్తుంది. ఇది పూర్తయిన తర్వాత, బీన్స్ ను ఎండబెట్టి ప్యాక్ చేయబడుతుంది. డెకాఫ్ కాఫీలో కెఫిన్ కంటెంట్ ఏమిటి? డెకాఫ్ కాఫీ కెఫిన్‌ను తొలగించే మొత్తం ప్రక్రియ ద్వారా వెళుతున్నప్పటికీ, దానిలోని ప్రతి మిల్లీగ్రాములను తొలగించడం అసాధ్యం. దీని అర్థం డెకాఫ్ కాఫీలో ఇంకా తక్కువ మొత్తంలో కెఫిన్ ఉందని, అయితే దానిని డీకాఫీ చేయడానికి ఉపయోగించే పద్ధతిని బట్టి ఈ మొత్తం మారుతుంది. సాధారణ కాఫీతో పోలిస్తే డెకాఫ్ కాఫీలో కనీసం మూడు శాతం కెఫిన్ ఉంటుంది. ఉదాహరణకు, సాధారణ కప్పు కాఫీలో కెఫిన్ మొత్తం 97 మి.గ్రా, అదే కప్పు డెకాఫ్ కాఫీకి 2 మి.గ్రా మాత్రమే ఉంటుంది. సగటున, ప్రతి 8నీళి కాఫీ 3ఎఔ నుండి 15ఎఔ కెఫిన్ మధ్య ఎక్కడైనా ఉండవచ్చు. ఒక సాధారణ కప్పు కాఫీలో 70 ఎంజి మరియు 140 ఎంజి కెఫిన్ మధ్య ఏదైనా ఉంటుంది. డెకాఫ్ కాఫీలో ఉన్న కెఫిన్ మొత్తం కాఫీ రకం మరియు దానిని తయారు చేయడానికి ఉపయోగించే పద్ధతి ఆధారంగా మారుతుంది. గర్భవతిగా ఉన్నప్పుడు ఏదైనా వినియోగించే ముందు మీరు పరిగణించే డెకాఫ్ కాఫీలో ఉన్న కెఫిన్ మొత్తాన్ని తనిఖీ చేయడం మంచిది. గర్భవతిగా ఉన్నప్పుడు మీరు డెకాఫ్ కాఫీ తాగచ్చా? డెకాఫ్ కాఫీలో ఉన్న కెఫిన్ మొత్తంలో గణనీయమైన తగ్గింపు ఉన్నందున, గర్భవతిగా ఉన్నప్పుడు సాధారణంగా తీసుకోవడం సురక్షితం. అయితే, మితమైన మొత్తంలో తీసుకోవడం చాలా ముఖ్యం. మీరు ఇప్పుడు ఒక కప్పు డీకాఫిన్ చేసిన కాఫీని ఆస్వాదించవచ్చు మరియు మీరు నిజంగా ఒక కప్పును కోరుకుంటే, అందులో ఇప్పటికీ కెఫిన్ కలిగి ఉంటుంది, కాబట్టి మీరు ఎంత వినియోగిస్తారనే దానిపై ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండండి. చాక్లెట్, శీతల పానీయాలు, టీ మరియు ఎనర్జీ డ్రింక్స్ వంటి ఇతర ఆహార పదార్థాలు తక్కువ మొత్తంలో కెఫిన్ కలిగి ఉన్నాయని గుర్తుంచుకోండి. మీరు కాఫీని తీసుకునే రోజున అదే రోజున వీటిలో దేనినైనా తీసుకుంటే, మీరు ఉద్దేశించిన దానికంటే ఎక్కువ కెఫిన్ వినియోగిస్తుంది. గర్భిణీ స్త్రీ రోజుకు ఎంత డెకాఫ్ కాఫీ తాగవచ్చు? గర్భిణీ స్త్రీ కోసం డెకాఫ్ కాఫీ ఉత్తమమైన పరిమాణం రెండు నుండి మూడు కప్పుల వరకు డెకాఫిన్డ్ కాఫీ. ఆదర్శవంతంగా, ఈ మొత్తం రోజుకు 200 ఎంజి కంటే ఎక్కువ ఉండకూడదు. దీని అర్థం మీరు మీ ఇంటి కోసం కొనుగోలు చేసే డెకాఫ్ కాఫీలో ఉన్న కెఫిన్ మొత్తాన్ని లేదా మీరు కాఫీ షాప్ నుండి కొనుగోలు చేసినప్పుడు మీరు తనిఖీ చేయడం చాలా ముఖ్యం.



## 48 గంటల్లో తేలనున్న రిషబ్ పంత్ భవితవ్యం.. ఫెయిలైతే, ఐపీఎల్ నుంచి ఔట్?

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ 2022 నుంచి క్రికెట్ ఫీల్డ్‌కు దూరంగా ఉంటున్నాడు. కారు ప్రమాదం తర్వాత త్వరగా కోలుకున్న రిషబ్ పంత్, ఇప్పుడు రాబోయే ఎఖఒ 2024 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడబోతున్నాడు. దీని కోసం అభిమానులతో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఎదురుచూస్తున్నారు. అయితే దీనికి ముందు, ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సౌరవ్ గంగూలీ కీలక అప్‌డేట్ ఇచ్చారు. టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ.. తాను ఫిట్‌గా ఉన్నట్లు ప్రకటించుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేశాడు. అందుకే నేషనల్ క్రికెట్ అకాడమీ (ఔఅం) అతనికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇస్తుంది. రిషబ్ పంత్ ఫిట్‌నెస్ పరీక్ష మార్చి 5న (అంటే 48 గంటల తర్వాత) జరగనుంది. దీని తర్వాత మాత్రమే మేం పంత్ కెప్టెన్సీ కోసం బ్యాకప్ ఎంపికను పరిశీలిస్తామం. కాబట్టి మేం పెద్దగా హైప్ సృష్టించడం లేదు. అతని ఫిట్‌నెస్ క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తున్నాం' అంటూ చెప్పుకొచ్చాడు. సౌరవ్ గంగూలీ ఇంకా మాట్లాడుతూ.. మరి పంత్ ఎలా చేస్తాడో చూడాలి.

## అద్భుత దృశ్యం... అపురూప స్వాగతం

### నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ కు పూల వర్షం





మెదక్ (శ్రీ ప్రస్థానం ప్రతినిధి):- - 85 లక్షల రూపాయలతో చిన్నశంకరంపేట మండల అభివృద్ధికి శ్రీకారం మెదక్ నియోజక వర్గంలోని చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 85 లక్షల రూపాయలతో చిన్నశంకరంపేట మండల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థి విద్యార్థులు పూల వర్షంతో నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ను స్వాగతిస్తున్న తీరు పలువురిని ఆకట్టుకుంది.?-రోడ్లతోనే గ్రామాలకు అందం?- నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్?- జంగరాయి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారంపల్లెలకు రోడ్లతోనే అందం అని... రోడ్లు బాగుంటే గ్రామాలు బాగుంటాయని నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం మెదక్ నియోజక వర్గంలోని చిన్నశకంరంపేట మండలం జంగరాయి గ్రామంలో ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్., పథకం క్రింద మంజూరైన అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న దృశ్యం.భవిష్యత్ లో నియోజక వర్గాని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తా- నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్- చిన్నశంకరంపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మెదక్ నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతో నియోజక వర్గంలోని ప్రతి పల్లె పల్లెను బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తానని నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం నియోజక వర్గంలోని చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు.

## ఏడుపాయల వనదుర్గాదేవిని దర్శించుకున్న మెదక్ ఆర్డీవో రమాదేవి



శ్రీ ప్రస్థానం పాపన్నపేట :-×ఏడుపాయల శ్రీ వనదుర్గా దేవి అమ్మవారిని మెదక్ ఆర్డీవో రమాదేవి శనివారం మధ్యాహ్నం దర్శించుకుని ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. వనదుర్గాదేవి అమ్మవారికి ఆర్డీవో రమాదేవి కుంకుమార్చన,విశేషాలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పార్థీవ శర్మ, రాజశేఖర్ లు వేద మంత్రాల మధ్య రమాదేవి కి అమ్మవారి అనుగ్రహ ఆశీస్సులను అందజేస్తూ, తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ మర్యాదలతో ఏడుపాయల ఆలయ సిబ్బంది ప్రతాప్ రెడ్డి ఆర్డీవో రమాదేవి కి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆర్డీవో రమాదేవి వెంట తహశీల్దార్ లక్ష్మణ్ బాబు తదితరులు ఉన్నారు.

## ప్రమాదవశత్తు పొలాల్లోకి దూసుకెళ్లిన బైక్...... ఒకరు మృతి



టేక్మాల్ (శ్రీ ప్రస్థానం ప్రతినిధి):-మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు బైక్ కిందపడి వ్యక్తి వృత్తి చెందిన ఘటన టేక్మాల్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన తలారి శివకుమార్ బైక్ పై రాత్రి టేకుమారి నుంచి ఏక్లాస్ పూర్ గ్రామం వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. బైక్ అతని మీద పడడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందడు శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టర్ నిమిత్తం చెవిపేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు



# బీబీపాటిల్ కు బీజేపీ కలిసొచ్చేనా..?

శ్రీ ప్రస్థానం ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి:-తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్ పార్టీకిరాజీనామా బీజేపీలో చేరడం స్థానికంగా చర్చనీ యాంశమైంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్ని కల్లో బీజేపీ మతతత్వ పార్టీయని ప్రచార వేదికలపై ఆరోపణలు చేసిన బీబీ పాటిల్ అదే పార్టీలో చేరడంపై అందరూ చర్చించుకుంటున్నారు. 2014, 2019పా ర్లమెంట్ ఎన్నికల్లో ఆయన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీయే. ఇక జహీరాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ విషయానికొస్తే.. ఈ సెగ్మెంట్ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, కామారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో బీఆర్ఎస్ బాన్సువాడ, జహీరాబాద్, కాంగ్రెస్,జూకల్,



ఎల్లారెడ్డి, అందోల్, నారాయణఖేడ్ స్థానాలను నిలుపుకొంది. కామారెడ్డి అసెంబ్లీ నియోజవకర్గ నుంచి కేసీఆర్ పోటీ చేసిన ప్పటికీ బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి చేతిలో ఓట మిపాలయ్యారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి 6,741 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా, కేసీఆర్ రెండో స్థానానికి పరిమితమయ్యారు. బీబీ పాటిల్ స్వంత నియోజకవ ర్గమైన జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీ కాంతరావు బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ షిండేపై 1,152 ఓట్ల మెజార్టీతో ఓడించారు. ఎల్లా రెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ పై కాంగ్రెస్ అభ్యర్థి మదన్మోహన్రావు 24వేల మెజార్టీతో గెలుపొందారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని అందోలులో బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిర ణ్పై కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహ.. 28 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి 6,547 ఓట్ల మెజార్టీతోగెలుపొందారు.పోటీ జహీరాబాద్లోనా, మహరాష్ట్రలోనాబీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎంపీ బీబీ పాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తారా? లేక మహరాష్ట్రలోని నాందేడ్ స్థానం నుంచి పోటీ చేస్తారా? అన్న విషయమై స్థానికంగా చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా ఏర్పడిన తర్వాత మహరాష్ట్రలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాలను అప్పట్లో కేసీఆర్ ఎంపీ బీబీ పాటి ల్లకు అప్పగించారు. మహరాష్ట్ర ప్రాంతంలో బీబీ పాటిల్ కు ఉన్న సంబంధాలు, వ్యాపారాలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ అక్కడి నుంచే పోటీ చేయమని కోరుతుందా? అని చర్చిస్తున్నారు. బీబీ పాటిల్ సన్నిహితులు మాత్రం జహీరాబాద్ నుంచే పోటీ చేస్తారని చెబుతున్నారు. బీజేపీ ప్రభుత్వంలోని పలువురుకేంద్ర మంత్రులతో పాటిల్కు సన్నిహిత సంబంధాలున్నట్లు ప్రచారం జరుగుతుంది. రెండు, మూడు రోజుల్లో ఈ విషయమై స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నా రు. కాగా, జహీరాబాద్ పార్లమెంటు సెగ్మెంట్లో, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 5,48,348 ఓట్లు పోలవగా... బీఆర్ఎస్ కు 5,30,194 ఓట్లు, బీజేపీకి .1,72,575 ఓట్లు వచ్చాయి ఈ మూడు పార్టీల ప్రభావం రేపు పార్లమెంటులో కనిపించబోతుంది

# పట్టుబట్టి...కొలువు కొట్టి - 4 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన మెదక్ యువతి

మెదక్ శ్రీ ప్రస్థానం ప్రతినిధి :-పేదరికంలో పుట్టడంతో, ఆ అమ్మాయి చిన్ననాటి నుండి ప్రభుత్వ పాఠశాలలోనే చదివింది. అయినా లక్షలు లక్షలు పెట్టి ప్రైవేట్ స్కూల్ లో చదివిన వారికంటే కూడా తన జీవితంలో ఎక్కువ సాధించి సత్తా చాటింది ఆ పల్లెటూరు అమ్మాయి.ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నాలుగు ఉద్యోగాలకు ఎంపికై కన్న తల్లిదండ్రులకు, తన సొంత గ్రామానికి ఎంతో పేరు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలోనే...... వివరాల్లోకి వెళ్తే?.. మెదక్ పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన బంజా రాజప్ప, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ,ఒక కుమారుడు ఉన్నారు. రాజప్ప తనకు ఉన్న కొద్దిపాటి పొలంతో కొడుకు అరవింద్, కూతుళ్లు సౌభాగ్య, సౌమ్య లను ప్రైవేటు బడిలో చదివించలేకపోయాడు. తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కాబట్టి, చేసేది లేక వారందరిని ప్రభుత్వ బడిలో చదివించాడు. కాగా రాజప్ప కుమారుడు అరవింద్ ఇటీవల నిర్వహించిన ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ లో జూనియర్ లైన్మెన్ ఉద్యోగం సాధించాడు. పెద్ద కూతురు సౌజన్యను డిగ్రీ వరకు చదివించి పెళ్లి చేసి అత్తారింటికి పంపించాడు. ఇక చిన్న కూతురైన సౌమ్య ఒకటి నుండి ఏడవ తరగతి వరకు సొంత గ్రామమైన అన్నారనీ ప్రభుత్వ బడిలో చదివించాడు , 8 నుండి 10వ తరగతి వరకు పక్క గ్రామమైన కొత్తపల్లిలో జిల్లా పరిషద్ హై స్కూల్ చదివింది, ఇంటర్మీడియట్ మెదక్ లోని గీతా జూనియర్ కళాశాలలో చదివి, డిగ్రీ మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తిచేసింది. చిన్నప్పటి నుండి చదువులో ఎంతో చురుకుగా ఉండే సౌమ్య, అనంతరం ఎమ్మెస్సీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసింది. ప్రస్తుతం, పీహెచ్డీ మొదటి సంవత్సరం చదువుతుంది.ప్రొఫెసర్ కావటమే జీవితాశయం......కాగా ఇటీవల నిర్వహించిన గ్రూప్ -4 జాబ్ సంపాదించినా సౌమ్య, గురుకుల సంక్షేమ కాలేజీల నియామకాల్లో టిజిటి, పిజిటి ,జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికయింది. దీనితో తాను? నెల వ్యవధిలోనే నాలుగు జాబ్ లు ఎంపికయినట్టయింది. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన సౌమ్య నాలుగు జాబ్ లకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా, సౌమ్య మాట్లాడుతూ, ప్రస్తుతం తాను జూనియర్ లెక్చరర్ జాబ్ లో జాయిన్ అవుతానని తెలిపారు. రానున్న రోజుల్లో పీహెచ్డీ పూర్తి చేసి, ప్రొఫెసర్ గా పనిచేయాలని తన లక్ష్మని ఆమె తెలిపారు. సౌమ్య తండ్రి, రాజప్ప మాట్లాడుతూ? సౌమ్య చిన్నప్పటి నుండి జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగాలని బలమైన కొరికే ఉండేదని. తాను, నాలుగు జాబ్ లకు ఎంపిక కావటం తనకు, తన కుటుంబానికి చాల గర్వంగా ఉన్నదని ఆయన తెలిపారు.



## మాస శివరాత్రి సందర్భంగా ఏడుపాయల జాతరకు 167 ప్రత్యేక బస్సులు

### - మెదక్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత



మెదక్ (శ్రీ ప్రస్థానం ప్రతినిధి) :-తెలంగాణ రాష్ట్రంలోని రెండవ అతిపెద్ద జాతరగా ఏడుపాయల వన దుర్గ భవాని జాతర కోసం ఈనెల 7 తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేకంగా 167 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టిసి మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా మెదక్ నుంచి 11 జేబీఎస్ నుంచి 33 హైదరాబాద్ నుంచి 12 సంగారెడ్డి నుంచి 19 సదాశివపేట నుంచి 13 జహీరాబాద్ నుంచి 18 బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు ఆర్టీసీ బస్సులు మాత్రమే దేవాలయం దగ్గర వరకు వెళ్తాయని వివరించారు.ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల సౌకర్యం కొరకు బస్సులను మెదక్ జోగిపేట్ సంగారెడ్డి నర్సాపూర్ బాలానగర్



సదాశివపేట నారాయణఖేడ్ జయరాబాద్ జౌరా సంఘం పెద్ద శంకరంపేట్ బోడుమెట్పల్లి శంకర్ పల్లి జేబీఎస్ నుంచి కూడా ప్రత్యేక బస్సులను ప్రభుత్వం నడపనుంది

## 26/11 ముంబై బాంబు పేలుళ్ల ప్రధాన సూత్రధారి మృతి

26/11 ముంబై బాంబు పేలుళ్ల (26/11 ప్రధాన సూత్రధారి, లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అజామ్ ఛీమా మృతి చెందినట్లు సమాచారం. పాకిస్థాన్లోని ఫైసలాబాద్ లో గుండెపోటుతో ఆయన మరణించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆయన అంత్యక్రియలు ఫైసలాబాద్లోని మల్కన్వాలాలో పూర్తైనట్లు సమాచారం.15 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి అజామ్ ఛీమా కీలక సూత్రధారిగా గుర్తించారు. దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాదులకు అజామ్ శిక్షణ ఇచ్చినట్లు అమెరికా నిఘా వర్గాలు వెల్లడించాయి.

## ముఖ్యమంత్రి నిర్ణయంతో హర్షం వ్యక్తం చేసిన టి.వై.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షులు చల్మెడ అనిల్ కుమార్..!



తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం హర్షించదగిందని తెలంగాణ,యూత్, జర్నలిస్ట్,ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్మెడ అనిల్ కుమార్ అన్నారు..!శనివారం నాడు తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అక్రిడేషన్ తో సంబంధం లేకుండా ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వ పరంగా పూర్తి స్వేచ్ఛను అందించి, సంక్షేమ పథకాలలో భాగస్వామ్యం కల్పించాలని కోరారు..!! జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టుల (జే ఎన్ జే) హౌసింగ్ సొసైటీ కి సంబంధించి ఇళ్ల స్థలాల అప్పగింతపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి తో జె ఎన్ జె ప్రతినిధులు చర్చించి ఒక రోడ్ మ్యాప్ తో తన దగ్గరకు వస్తే ఒక్క నిమిషంలో సంబంధిత ఫైలు పై సంతకం చేస్తానని ముఖ్యమంత్రి చెప్పారు ప్రభుత్వం జర్నలిస్టులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతుందని అన్నారు ప్రెస్ అకాడమీతో రాష్ట్రంలోని అన్ని జర్నలిస్ట్ యూనియన్ల సలహాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు..!ముఖ్యమంత్రి నిర్ణయంతో రాష్ట్రంలోని వివిధ సంఘాల జర్నలిస్టులు నూతనోత్సాహం వస్తుంది

## కాధ్లూరు పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఆందోల్ (శ్రీ ప్రస్థానం ప్రతినిధి):-మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నేడు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవనీ జరుపుకున్నారు 7వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా చక్కని ప్రదర్శనను గావించారు . ఈ కార్యక్రమంలో కలెక్టర్ గా ఎం, అశ్విని. ప్రధానోపాధ్యాయులుగా ఎం, హర్షవర్ధన్. డి ఈ ఓ గా, ఎం తేజస్విని. ఎం సి ఓ గా, కే దుర్గాప్రసాద్. మరియు ఉపాధ్యాయులుగా అక్షరా వైష్ణవి కృష్ణవేణి వర్షిని సాయికుమార్ భరత్ రామ్ చరణ్ అవినాష్ ఉపాధ్యాయుల తమ తమ ప్రతిభను కనబరిచారు . పాఠశాల ప్రధానోపాధ్యాయులు షహీన్ సుల్తానా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయుల బాధ్యత గురించి వారి గొప్పతనాన్ని విద్యార్థులకు సూచించారు మంచి విద్య బోధన చేసిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులచే బహుమతి ప్రధానం చేయడం జరిగింది పాఠశాల ఉపాధ్యాయులు సి,హెచ్ , అనిల్. విజయ సారథి. దుర్గా ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు

## ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నేత దారుణ హత్య.. వారిపైనే అనుమానం !

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో బీజేపీ నేతను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి చంపారు. ఈ ఘాతుకానికి పాల్పడింది మావోయిస్టులు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.జన్‌పడ్ పంచాయతీ సభ్యుడైన బీజేపీ నేత కట్ల తిరుపతి శుక్రవారం రాత్రి బీజాపూర్ జిల్లాలోని టోయనార్ గ్రామంలో ఓ పెళ్లికి హాజరయ్యారు.కార్యక్రమం పూర్తి చేసుకుని తిరిగి వెళుతుండగా కొందరు వ్యక్తులు పదునైన ఆయుధంతో అతడిని పొడిచి చంపారని బీజాపూర్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) జితేంద్ర యాదవ్ తెలిపారు. చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లినపుడు అక్కడ మృతి చెందినట్లు చెప్పారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీకి చెందిన నేత హత్యకు గురవడం గత సంవత్సర కాలంలో ఇది ఏడోసారి కావడం కలకలం రేపుతోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో నారాయణ్‌పూర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రతన్‌దూబేను మావోయిస్టులు హత్య చేశారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757